

28న చెరుకు రైతుల రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఈనెల 28న రైతుసంఘం ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండు సీజన్లుగా ఫ్యాక్టరీ మూతపడంతో ఈ ప్రాంత రైతులు పక్క జిల్లాలోని సంకిలికి చెరుకు వెళ్లడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకుని రైతులకు న్యాయం చేయాలని, మరిన్ని రైతాంగ సమస్యలపై ఈ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కావున రైతులంతా ఈ సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు

చంద్రబాబు సక్సెస్

- భారీగా తరలివచ్చిన తెలుగు తమ్ముళ్లు
- రవాణా, ఖర్చులకు భారీగా గుమ్మరించిన నాయకులు
- ఆకాశమే హద్దుగా విమర్శలు చేసిన బాబు



బొబ్బిలి రోడ్‌షోలో టిడిపి శ్రేణులకు అభివాదం చేస్తున్న అధినేత చంద్రబాబునాయుడు (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో 22వ తేదీ నుంచి మూడు రోజుల పాటు 'ఇదేం కర్మ' పేరిట సాగిన టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పర్యటన విజయవంతమైంది. సభలకు తెలుగు తమ్ముళ్లు భారీగా తరలివచ్చారు. రహదారి పొడవునా ఎక్కడికక్కడ టిడిపి అభిమానులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. గజమాలలు, హారతి, తిలకాలతో బాబుకు ఆశీర్వచనాలు అందించారు. డప్పుల దరువులు, తప్పెటగుళ్లు, బాణసంచా పేలుళ్లతో మూడు రోజులపాటు బాబు తిరిగిన ప్రాంతమంతా పండగ వాతావరణం నెలకొంది. ఇందుకోసం ఆయా ప్రాంతాల నాయకులు భారీ సమీకరణాలు చేపట్టారు. గ్రామాలను యూనిట్‌గా తీసుకుని ప్రయాణ ఏర్పాట్లు చేశారు. దారిఖర్చులు కూడా ఇవ్వడంతో తమ్ముళ్లలో జోష్ పెరిగింది. విజయనగరంలో జరిగిన సభకు గజపతినగరం, శృంగవరపుకోట, నెల్లిమర్ల నియోజకవర్గాల నుంచి జనాన్ని తరలించారు. భారీగా తరలివచ్చిన జనాన్ని చూసిన చంద్రబాబు ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఆకాశమే హద్దుగా ఉన్నవీ లేనివీ కలగలిపి ప్రసంగించారు.

మరోవైపు వచ్చే ఎన్నికల్లో పార్టీ నుంచి టిక్కెట్ ఆశిస్తున్న నాయకులంతా బాబు దృష్టిలో పడేందుకు ప్రయత్నించారు. బాబు మాత్రం ఆయా నియోజకవర్గాల్లో తిరిగినప్పుడు తన పక్కన ఒకరికి మాత్రమే స్థానం ఇచ్చారు. రాజాం నియోజకవర్గంలో బాబును ఆకర్షించేందుకు ఓవైపు మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, ఆమె కుమార్తె గ్రీష్మ, మరోవైపు మాజీ మంత్రి కొండ్రు మురళి పోటీపడ్డారు. రోడ్‌షో, బహిరంగ సభలో కొండ్రు మరళికే కీలక స్థానం దక్కింది. ఇటు బొబ్బిలిలో మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు కన్నా ఆయన సోదరుడు బేబినాయనకు ప్రాధాన్యత లభించింది. గజపతినగరంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడును టార్గెట్ చేస్తూ కరణం శివరామకృష్ణను జిల్లాకు చెందిన కీలక నేత అశోక్ గజపతిరాజు ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలు ఉన్న విషయం విదితమే. పర్యటనలో చంద్రబాబు పక్కన కె.ఎ.నాయుడుకు మాత్రమే స్థానం దక్కింది. అదే శివరామకృష్ణను విజయనగరం బహిరంగ సభలో వేదికపైకి ఎక్కించడం, బాబు ఆగ్రహంతో వెనక్కి తగ్గడం చర్చనీయాంశంగా మారింది. కెఎ నాయుడి బలాన్ని తక్కువ చేసేందుకు గజపతినగరానికి చెందిన కేడర్ స్థానికంగా లేకుండా చేసి, విజయనగరానికి తరలించారన్న విమర్శలు కూడా ఉన్నాయి. విజయనగరంలో బాబు పక్కన తొలి ప్రాధాన్యత అశోక్‌కి మాత్రమే దక్కింది. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీచేసిన అదితి గజపతిని రెండు స్థానంలోకి నెట్టడంతో ఈ సారి అశోక్‌ను అసెంబ్లీ బరిలో దింపే ఆలోచనలో చంద్రబాబు ఉన్నట్టుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

ముఖ్యంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి, జిల్లాకు చెందిన విద్యాశాఖ మంత్రి బొత్స, ఉత్తరాంధ్ర పార్టీ ఇన్‌ఛార్జులు విజయసాయిరెడ్డి, వైవి సుబ్బారెడ్డిపైనే చంద్రబాబు విమర్శలు గుప్పించారు. వైసిపి నాయకుల సంగతి తేలుస్తాం.... బట్టలూడదీసి బజారుకీడుస్తాం, సిఎం జగన్‌ను సైకో.. అంటూ సంబోధించడం, తీవ్ర పదజాలంతో అవినీతి, అక్రమాల ఆరోపణలు చేయడం పట్ల అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, మంత్రి బొత్స అభ్యంతరం వ్యక్తం చేస్తూ సమావేశాలు నిర్వహించారు. బాబు పాలనలో జిల్లాకు చేసిందేమిటో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేసినప్పటికీ ఆ దిశగా వివరించడంలో చంద్రబాబు విఫలమయ్యారు. వైసిపి హయాంలో చేపట్టిన మెడికల్ కాలేజీని కూడా బాబు తనఖాతాలో వేసుకుని అధికార పార్టీపై తిట్లపురాణం గుప్పించడంతో తెలుగు తమ్ముళ్లు నాలుక కరుసుకున్నారు. ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్న తోటపల్లి సాగునీటి ప్రాజెక్టును తానే పూర్తిచేశానంటూ ప్రగల్భాలు పలకడం చర్చనీయాంశంగా మారింది. మొత్తం మూడు బహిరంగ సభల్లోనూ ఒకటే పాట అన్నట్టుగా ప్రసంగించడంతో ఆ పార్టీ క్రియాశీలక కార్యకర్తలకు సైతం రుచించలేదు. టిడిపి హయాంలో మూతపడ్డ జ్యూట్‌మిల్లులు, చక్కెర పరిశ్రమలను తిరిగి తెరిపిస్తానంటూ మాట ఇవ్వడం కొసమెరుపుగా చెప్పుకుంటున్నారు.

తేలని వాటాల లెక్క

- అధికారపార్టీ నాయకుల మధ్య కుదరని డీల్
- డిప్యూటీ సిఎం దృష్టికెళ్లినా తేలని పంచాయితీ
- వాలంటీర్ పోస్టుల భర్తీలో తీవ్ర జాప్యం



ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో వార్డు వాలంటీర్ పోస్టుల భర్తీకి సంబంధించిన లెక్కలు ఇంకా తేలలేదు. దీంతో పోస్టుల భర్తీ వాయిదాల మీద వాయిదాలు పడుతోంది. రెండునెలల క్రితం మున్సిపాలిటీలో 19 వార్డు వాలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. సుమారు 80మంది నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకున్నారు. నిర్దేశించిన గడువులోగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. అయితే పోస్టుల భర్తీ మాత్రం జరగలేదు. అధికారపార్టీ నాయకుల మధ్య పంపకాల ఒప్పందం కుదరని కారణంగానే భర్తీలో జాప్యం జరుగుతోందన్న చర్చ జరుగుతోంది. చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వార్డు కౌన్సిలర్ల మధ్య వాటాల సంగతి తేలకపోవడంతో అధికారులు భర్తీ చేయకుండా వదిలేశారు. ఈ వ్యవహారం డిప్యూటీ సిఎం రాజన్నదొర దృష్టికి కూడా వెళ్లినా ఇంకా అలాగే ఉంది. తనకు నాలుగు వాలంటీర్ పోస్టులు కావాలని పట్టణానికి చెందిన ముఖ్య ప్రజాప్రతినిధి డిమాండ్ చేస్తుండడంతో మిగిలిన కౌన్సిలర్లు అభ్యంతరం తెలుపుతున్నారు. సాధారణంగా ఏ వార్డులో వాలంటీర్ పోస్టులు ఆ వార్డు కౌన్సిలర్ సిఫార్సు మేరకు భర్తీ చేయాల్సి ఉంటుంది. కానీ కొంతమంది సీనియర్ నాయకులు తమకు ఎక్కువ కావాలని పట్టుబట్టడంతో ప్రతిష్టంభన ఏర్పడింది. డిప్యూటీ సిఎం రాజన్నదొర కూడా ఈ వ్యవహారంలో ఎటూ తేల్చుకోలేక పోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. వాలంటీర్ పోస్టుకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో కొంతమంది నిరుద్యోగ యువకులు రూ.30వేల నుంచి రూ.50వేల వరకు ముడుపులు చెల్లించడానికి సిద్ధమవుతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో లక్షలు ఖర్చు చేసి గెలిచిన కౌన్సిలర్లు వార్డులో వాలంటీర్‌కున్న విలువ కూడా తమకు లేదని వాపోతున్నారు. సంక్షేమ పథకాల మంజూరులో తమకు ఏ మాత్రం ప్రమేయం లేకపోవడంతో ప్రజలు తమను గుర్తించడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కనీసం వార్డు వాలంటీర్ పోస్టుల భర్తీలోనైనా ప్రాధాన్యత లేకపోతే ఎలాగని ప్రశ్నిస్తున్నారు. నెలల తరబడి వాలంటీర్ పోస్టుల భర్తీలో జాప్యం జరుగుతుండడంతో ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు ఆశతో ఎదురుచూస్తున్నారు. ప్రతిభ ఆధారంగా ఎంపికలు జరుగుతాయని భావిస్తున్నారు. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా వుంది. అధికారపార్టీ నాయకుల మధ్య పంపకాల పంచాయతీ తేలని కారణంగా అధికారులు నలిగిపోతున్నారు. ఐదు వేల రూపాయల వేతనం వచ్చే వాలంటీర్ పోస్టులకే ఇంత డిమాండ్ ఉంటే అంతకన్నా పెద్ద పోస్టులకైతే నాయకులు ఇంకెంత సిగపట్లు పడతారోనన్న చర్చ జరుగుతోంది.



తాలాడలో ఏనుగులు ధ్వంసంచేసిన అరటి పంట

తాలాడలో ఏనుగుల బీభత్సం

ప్రజాశక్తి - భామిని

వాణిజ్య, వ్యవసాయ పంటలు, నీటి వనరులు అధికంగా గల భామిని మండలం తలాడలో నాలుగు ఏనుగులు గత 4 రోజులుగా పంటలను నాశనం చేస్తూ రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. పగలంతా ఏనుగులు తోటల్లోనూ, నిర్మానుష్య ప్రదేశాల్లో ఉంటూ సాయంత్రం 5 గంటల తర్వాత మొక్కజొన్న, వరి కుప్పలు, అరటి చెట్లు, మొక్కజొన్న, పంటలను నాశనం చేస్తున్నాయి. తాలాడకు చెందిన రైతులు వలురోతు రామారావు, సంజీవరావు, లక్ష్మణరావు, సి.వెంకటరావు, వి.ప్రకాశరావు, బురడా భాస్కరరావు నూర్పు చేసి ఉంచిన ధాన్యాన్ని కాళ్లతో చెల్లాచెదురు చేసి, తొండంతో విసిరివేస్తున్నాయి. అలాగే పొట్టతో ఉన్న మొక్క జొన్నను చీల్చివేస్తున్నాయని, అరటి చెట్లు నాశనం చేస్తున్నాయని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. అలాగే పొలాల్లోని సోలార్ మోటర్లు, ఇంజిన్ పంప్ సెట్లు పీకి పారేస్తున్నాయన్నారు. శనివారం సాయంత్రం గ్రామం సమీపంలో లోకి ఏనుగులు రావడంతో తీవ్ర భయాందోళనకు గురయ్యామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎలిఫెంట్ ట్రాకర్లు ఏనుగులు ఎక్కడ ఉన్నాయో తెలుసుకోవడమే తప్ప, పంటలు నాశనం చేయకుండా కాపాడే చర్యలు లేవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఏనుగులు పంటలను నాశనం చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అవినీతి, అభివృద్ధిపై చర్చకు సిద్ధం

చంద్రబాబుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సవాల్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అవినీతి, అభివృద్ధిపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. ఓటమి భయంతోనే అసత్యాలు, మోసపు మాటలు చంద్రబాబు చెప్పారన్నారు. మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు జిల్లా పర్యటన సాగిందన్నారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 ఏళ్ల కాలంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఏం చేశారో చెప్పలేని స్థితిలో జిల్లా పర్యటన సాగిందన్నారు. సైకిల్ పోవాలన్న చంద్రబాబు వ్యాఖ్యలు నిజమైనా, ఇంకా బుద్ధి రాలేదా? అని ప్రశ్నించారు. మంత్రి, ఎమ్మెల్యే ఓడిపోవాలన్న చంద్రబాబు.. తమ గెలుపు సంగతి పక్కనపెట్టి, కుప్పంలో గెలవగలరా? అని సవాల్ చేశారు. గడపగడపకు వెళ్లి పథకాల గురించి అడగగలరా? అని ప్రశ్నించారు. ప్రజల్లో రాజకీయ అవగాహన వచ్చిందని, ఏ కుట్రలు చేసినా ప్రజలు మరోమారు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. భూముల కబ్జా, అవినీతి చేశామంటున్న చంద్రబాబు దమ్ముంటే నిరూపించాలని సవాల్ విసిరారు. విశాఖను పరిపాలన రాజధానిగా వద్దని చెప్పి, ఆర్థిక, ఐటి రాజధాని చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అశోక్ గజపతిరాజును ఎందుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా పెడుతున్నారని, తనతో ఇంకెవరూ పోటీకి సరికారనే భయంతో అలా నిర్ణయించారని, అది చంద్రబాబు ఓటమికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. సమావేశంలో వైసిపి నాయకులు అశపు వేణు, ఎస్‌వివి రాజేష్, కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

చంద్రబాబు కోరిక నెరవేరుస్తాం : జెడ్‌పి చైర్మన్

సైకిల్ పోవాలన్న చంద్రబాబు వ్యాఖ్యలను జిల్లా ప్రజలు తప్పకుండా నెరవేరుస్తారని వైసిపి జిల్లా అధ్యక్షులు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు మూడు రోజుల జిల్లా పర్యటన అబద్ధాలు, మోసపు మాటలతో సాగిందన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ఎన్‌టిఆర్ గుర్తుకువస్తారని, అది చంద్రబాబుకు అలవాటుగా మారిందని చెప్పారు. తనపై చంద్రబాబు చేసిన ఆరోపణలు నిరూపించాలన్నారు. ఓటమి పాలైన తరువాత అశోక్ గజపతి, సుజయ్ ప్రజల్లో ఎప్పుడూ కనిపించలేదని, మూడున్నరేళ్లు ఎక్కడున్నారని ప్రశ్నించారు. అశోక్ నీతి, నిజాయతీ ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. కోర్టుల్లో 150 కేసులు ఉంటే ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే శంకుస్థాపనల ముఖ్యమంత్రిగా చంద్రబాబుకు పేరుందని ఎద్దేవాచేశారు. రైతుల ధాన్యం కొనుగోలు చేయలేదని ఏ ఒక్క రైతు అయినా చెప్పారా? అంటూ నిలదీశారు. కరువు, బాబు కవల పిల్లలని, టిడిపి హయాంలో రైతులు ఎక్కడైనా బాగు పడ్డారా? అని ప్రశ్నించారు. లంచాలు, సిఫార్సులు తమ ప్రభుత్వంలో లేవన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు సూర్యనారాయణరాజు, నారాయణ మూర్తి రాజు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతుసంఘం, సిఐటియు నాయకులు

విద్యుత్తు బిల్లులను ఉపసంహరించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ సవరణ బిల్లును తక్షణమే ఉపసంహరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలిలో గల గాంధీబొమ్మ వద్ద సిఐటియు మండల నాయకులు చింత పోలిరాజు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం విద్యుత్ సవరణ బిల్లును తీసుకురావడం రైతాంగంతో పాటు ప్రజలందరికీ తీవ్రమైన ప్రమాదం పొంచి ఉందన్నారు. ఇప్పటికే ఈ విద్యుత్ సవరణ బిల్లును అనేక మంది ఎంపిలు వ్యతిరేకించినప్పటికీ మోడీ ప్రభుత్వం దుర్మార్గంగా ఈ బిల్లును అమలు చేస్తుందన్నారు. కేరళ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విద్యుత్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశాయని, మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ బిల్లును వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కీర్తిశేషులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆనాడు విద్యుత్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాలతో కలిసి పోరాడారని, అటువంటి మహనీయుని ఆలోచనలకు విరుద్ధంగా మోడీ తీసుకొచ్చిన విద్యుత్ సవరణ బిల్లును అమలు చేయడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నించడం దుర్మార్గమని అన్నారు. ఇప్పటికైనా శీతాకాల సమావేశాల్లో విద్యుత్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్ర ప్రజలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బి.సన్యాసిరావు, కె.వీరం నాయుడు, కార్మిక సంఘాల నాయకులు పి.అప్పారావు, అంపోలు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన ఇళ్లకు రిజిస్ట్రేషన్లు

- జగనన్న ఇళ్ల నిర్మాణంలో జిల్లాకు నాలుగో స్థానం
- బకాయిల్లేకుండా బిల్లుల చెల్లింపు
- 'ప్రజాశక్తి'తో గృహనిర్మాణ సంస్థ పీడీ పి.రఘురాం ముఖాముఖి





జిల్లాలో ఈనెలాఖరులోగా పూర్తయిన ఇళ్లంటికీ ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని జిల్లా గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పి.రఘురాం చెప్పారు. జగనన్న ఇళ్లనిర్మాణాల పురోగతిలో జిల్లా నాలుగో స్థానంలో ఉందన్నారు. అలాగే లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ఇబ్బందులు పడకుండా అన్ని లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. ఇప్పటి వరకూ నిర్మాణమైన లబ్ధిదారులందరికీ బిల్లులు చెల్లించామన్నారు. పలువురు లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేయడంలో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో ఉందని చెప్పారు. జిల్లాలో చేపడుతున్న జగనన్న ఇళ్ల నిర్మాణాలు, తదితర అంశాలపై ప్రజాశక్తితో ముఖాముఖి మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే... -ప్రజాశక్తి, కలెక్టరేట్

జిల్లాకు ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి?

జిల్లాకు 24,740 ఇల్లు మంజూరయ్యాయి. వీటిలో 7,500 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 6,332 ఇళ్లు బేస్మెంట్ లెవెల్‌లోనూ, 5,117 పునాదులు పూర్తి కాగా, 2149 ఇళ్ల పైకప్పుల వరకు నిర్మించబడ్డాయి. 1054 ఇళ్ల పైకప్పు పూరైంది.

జిల్లాలో ఎన్ని లేఔట్లు ఉన్నాయి?

జిల్లాలో 309 లేఅవుట్లు ఉన్నాయి. ఈ లేఔట్‌లో 12,167 ఇళ్ల నిర్మాణాలకు మంజూరు చేయగా, వీటిలో 771 పూర్తయ్యాయి. బేస్‌మెంట్ లెవెల్లో 3878, పునాదుల వరకు పూర్తయినవి 3049, పైకప్పు వరకు పూర్తి చేయబడినవి 490, పైకప్పు వేసినవి 225ఉండగా, ఇంతవరకు ప్రారంభం కాని ఇళ్లు 55 ఉన్నాయి.

లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం ఎంత?

గృహ నిర్మాణ లబ్ధిదారులకు రూ.లక్షా80వేలు ప్రభుత్వం ఆర్థిక సాయంగా అందిస్తుంది. ఇందులో రూ.లక్షా50వేలు గృహనిర్మాణశాఖ, రూ.30వేలు ఉపాధి హామీ పథకం ద్వారా అందించడం జరుగుతుంది. అలాగే స్వయం సహాయక సంఘాల ద్వారా రూ.30 వేలు రుణం అందిస్తోంది. జిల్లాలో స్వయం సహాయక సంఘాల ద్వారా అత్యధికంగా నిర్మాణాలకు రుణాలు మంజూరు చేసి మొదటి స్థానంలో ఉన్నాం.

జగనన్న కాలనీలో లేఔట్లలో ఎటువంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

జగనన్న కాలనీలో లేఅవుట్లలో అప్రోచ్ రోడ్లు, విద్యుత్ సౌకర్యం, చేతి పంపులు ద్వారా నీటి సౌకర్యం కల్పిస్తున్నాం. కొన్ని చోట్ల పెద్ద లేఅవుట్లలో ఇంటి నిర్మాణ సామాగ్రి నిల్వ చేయడానికి గోదాం ఏర్పాటు చేశాం. లేఔట్లలో గృహ నిర్మాణ కార్మికులు, లబ్ధిదారులు విశ్రాంతి తీసుకోడానికి విశ్రాంతి షెడ్డులను నిర్మించాం. నిర్మాణం పూర్తయిన ప్రతి ఇంటికి విద్యుత్ మీటర్ ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నాం. ఈనెలాఖరులో ఇప్పటి వరకు నిర్మాణం పూర్తికాబడిన గ్రామీణ ఇళ్లకు రిజిస్ట్రేషన్ కూడా చేయబోతున్నాం.

గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం ఏఏ వస్తువులను సబ్సిడీదారులకు అందిస్తుంది?

గృహ లబ్ధిదారులకు 90 సిమెంటును బస్తాలు, టన్ను ఐరన్, ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుక, అలాగే సబ్సిడీ ధరలకే విద్యుత్, శానిటరీ, మరుగుదొడ్ల సామాగ్రి, ఫ్యాన్లు, పివిసి డోర్ ఫ్రేమ్‌లు, కిటికీలు సబ్సిడీ ధరలకే అందిస్తున్నాం.

లబ్ధిదారులకు ఎంత మొత్తంలో బిల్లు చెల్లించారు?

గృహ నిర్మాణ లబ్ధిదారులకు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నాం. ఇంతవరకు చెల్లించని బిల్లులకు గాను రూ.18.2 కోట్లు చెల్లించాం.

దారితప్పుతున్న ఆదాయం

పర్యవేక్షణ కరువు • చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు



మార్కెట్ కమిటీలో అందుబాటులో లేని అధికారులు

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా వ్యవసాయ మార్కెట్ కమిటీ పనితీరు దారితప్పుతుంది. ప్రభుత్వ ఆదాయానికి గండిపడే పరిస్థితే కనిపిస్తుంది. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఉన్నతాధికారులు చూసీచూడని ధోరణిలో వ్యవహరించడంతో వ్యవసాయ మార్కెట్‌కమిటీ పరిస్థితి అధ్వాన్నంగా మారింది. డివిజన్ కేంద్రమైన పాలకొండ వ్యవసాయ మార్కెట్‌కమిటీ గ్రేడ్-2లో ఉంది. ఏటా రూ.కోటీ 50 లక్షలు ఆదాయం వస్తుంది. పంట ఉత్పత్తుల ద్వారా 2శాతం సెస్ పాలకొండ, భామిని మండలాల్లో ఉండే చెక్‌పోస్టుల ద్వారా వసూలు చేస్తున్నారు. అయితే చెక్కుపోస్టులపై పూర్తి నిఘా లేకపోవడంతో ఆదాయం పక్కదారి పడుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పార్వతీపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇక్కడ అదనపు బాధ్యతలు నిర్వహిస్తుండగా ఆయన కనీసం నెలకు ఒకసారి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అయితే మరో సూపర్‌వైజర్ ఉన్నప్పటికీ ఆమె కూడా వచ్చామా వెళ్లామా అన్న రీతిలో వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో 14 మంది ఉన్న ఔట్ సోర్సింగ్ సిబ్బందే ఈ బాధ్యతలు చూస్తున్నారు. చెక్‌పోస్టులు తనిఖీ చేసే పరిస్థితి కూడా ఆ శాఖాధికారులకు లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిస్థితిపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో పాలకొండ చెక్‌పోస్టు మీదుగా వందలాది వాహనాల్లో ధాన్యం, చెరకు, పత్తి ఇతర పంటలు వెళ్తున్నా వాటిని వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి మిల్లు యజమానులతో వీరికి సత్సంబంధాలున్నట్టు తెలుస్తోంది. దీంతో వీరు ఎటువంటి తనిఖీలు చేపట్టకుండా చూసీచూడని ధోరణిలో వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. అదే విధంగా గోదాంల నుంచి కూడా ప్రతి నెలా వీరికి మామూళ్లు వెళ్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్లాది రూపాయల ఆదాయం తెచ్చిపెట్టిన వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిస్థితి పట్ల పలువురు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యవసాయ మార్కెట్‌ను గాడిలో పెట్టాలని పలువురు కోరుతున్నారు.



ఇదే మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు




పేదలకు బట్టలు అందజేస్తున్న కల్పవల్లి ఆశ్రమ నిర్వాహకులు రాజేంద్రకుమార్

ప్రజలంతా ఆనందంగా ఉండాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రతి పండగలో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉండాలని కల్పవల్లి ఆశ్రమ నిర్వాహకులు కోలా రాజేంద్రకుమార్ అన్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొని ఆదివారం స్థానిక బొగ్గుల వీధిలోల్ గల పేదకు అన్నదాన, వస్త్రదాన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించి పేదల ఇంట పండగ వాతావరణాన్ని కల్పించారు. రాజేంద్ర కుమార్ చొరవ పట్ల పార్వతీపురం పట్టణ ప్రజలు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాల్లో ఉంటున్నప్పటికీ తన సొంత ప్రజలను గుర్తు చేసుకుంటూ ప్రతి ఏటా సంక్రాంతి, క్రిస్మస్ సందర్భంగా అనేక రకాలైన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పేదలను అక్కున చేర్చుకొని పండగ పూట ఆనందాన్ని అందించడంలో తృప్తి పొందుతున్నానని అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో తనతో పాటు తన మిత్రులందర్నీ కలుపుకొని 20 ఏళ్లుగా ఈ ప్రాంతానికి సేవలందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమాలలో ప్రజాసంఘాల నాయకులు పాకల సన్యాసిరావు, గొర్లి వెంకటరమణ, ముట్నూరు, వెంకటరమణ, బివి రమణ, శిరేల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడుస్తున్న యువతులు

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు రోజు కావడం, అందులో క్రిస్మస్ రోజు కావడంతో జిల్లా నలుమూల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పర్యాటకులు తరలివచ్చారు. పార్క్‌లో ఉన్న అందాలను ఆశ్వాదించారు. యువతీ యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. ఆనంద విహార వద్ద డాన్సులు వేశారు. జలవిహార్ వద్ద బోటుషికార్లు చేశారు. అనంతరం మెట్టగూడ జలపాతాన్ని సందర్శించారు.



పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని జక్రవలస, వణుకువలస గ్రామాల్లో 60 మందికి నిరుపేదలకు స్థానిక సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం చీరలు పంపిణీ చేశారు. బాల వికాస్ దినోత్సవం సందర్భంగా జిల్లా బాల వికాస్ ఇన్‌ఛార్జి మోహన్ సాయి చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. ప్రతి ఏటా నిరుపేదలకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ కేపీ నాయుడు, జిసిసి మేనేజర్ జి.నరసింహులు, కమిటీ సభ్యులు ఉషశ్రీ, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



గిరిజన సంప్రదాయ నృత్యం చేస్తున్న మహిళలు

సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కందికొత్తల ఉత్సవాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకై ఐటిడిఎ అధికారులు కందికొత్తల ఉత్సవాలను ప్రోత్సహించాలని పలువురు గిరిజన సంఘాల నాయకులు కోరారు. కందికొత్తల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక క్రీడామైదానంలో పి.ఆమిటి, తాడికొండ, ఇరిడి, డుమ్మంగి తదితర గ్రామాల నుంచి గిరిజనులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టేలా జట్టుకట్టు, థింసా నృత్యం ప్రదర్శనలు మహిళలు, యువత చేశారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు పరిరక్షణకు గిరిజనులంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు మండంగి భూషణ, బిడ్డిక పద్మావతి, కద్రక కళావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 26న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ట్యాబులు పంపిణీ చేయనున్నట్లు ఎంఇఒ పి.కృష్ణమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులంతా ఉదయం 10 గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు.

చింతలవలసలో ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ

డెంకాడ : మండలంలోని చింతలవలస గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆదివారం మాజీ కేంద్ర మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు ఆవిష్కరించారు. చింతలవలస గ్రామానికి చెందిన టిడిపి నాయకులు పిన్నింటి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గం ఇంఛార్జి పతివాడ నారాయణ స్వామి నాయుడు, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు, భోగాపురం మాజీ ఎంపిపి కర్రోతు బంగార్రాజు, నాయకులు పతివాడ అప్పలనారాయణ, పల్లె భాస్కర్ రావు, ఐవీపీ రాజు, పతివాడ తమ్మినాయుడు, కర్రోతు సత్యనారాయణ, పతివాడ తారక రామానాయుడు, పతివాడ శివరామ విద్య సాగర్ నాయుడు, పడాల చిన్నారావు, చిల్ల పద్మ, చీకటి సుహాసిని, పాలు శ్రీను, సవరవిల్లి సత్యవతి, సవరవిల్లి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

జిల్లాలో క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజామునే క్రైస్తవులు నూతన వస్త్రాలు ధరించి చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పార్వతీపురంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు అధికారులు, ప్రజాప్రతినిధులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

సాలూరురూరల్ : మనుషుల పట్ల ప్రేమ, దయ, కరుణ చూపాలని బోధించిన ఏసుక్రీస్తు కరుణామయుడని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. క్రిస్మస్ సందర్భంగా మండలంలోని కురుకుటి పంచాయతీ దొరలతాడివలసలో ఆదివారం బేతేలు చర్చిలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పాస్టర్లు సువార్త రావు, ప్రసాద్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇరుగుపొరుగు వారితో ప్రేమ, అభిమానంతో వ్యవహరించాలని క్రీస్తు బోధించారని చెప్పారు. కార్యక్రమంలో సారిక పంచాయతీ సర్పంచ్ గొర్లి రాజారావు, మాజీ సర్పంచ్ సత్యవతి, సర్పంచ్ ప్రతినిధి గిన్నెల అప్పారావు, సాంబ, పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్: క్రిస్మస్‌ను పురస్కరించుకొని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో పాటు వారి కుటుంబ సభ్యులకు మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, పలు విభాగాల అధికారులు, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు కౌన్సిలర్లు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బెలగాం జయప్రకాష్ నారాయణ, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, మండల అధ్యక్షులు రమేష్, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి పుష్పగుచ్ఛాలను అందించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి ఎమ్మెల్యే చేతుల మీదుగా కేకును కట్ చేయించారు. అనంతరం ఎమ్మెల్యే జోగారావు నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ విందును ఏర్పాటు చేశారు. అలాగే స్థానిక ఆర్‌సిఎం చర్చి తీరు కుటుంబ దేవాలయంలో రెవరెండ్ ఫాదర్ వినోద్, బెలగాంలోని సెయింట్ పాల్ లూథరన్ పరిశుద్ధ చర్చి రెవరెండ్ ఫాదర్ రామారావు ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో క్రైస్తవులు పాల్గొని క్రీస్తుకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కురుపాం : స్థానిక రావాడ కూడలిలో గల గుడ్ సమారిటన్ లూథరన్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ జీవన్ కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రీస్తు దేవుని కుమారుడైనప్పటికీ మానవునిగా జన్మించి, మానవులను పాపంల నుంచి రక్షించుటకై అవతరించారన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు డి.జాన్, రాజారత్నం, సుదర్శన్, ప్రదీప్, జయకుమార్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: ఏజెన్సీలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమగండి ఆర్సీఎం చర్చిలో ఏర్పాటు చేసిన పశువులపాక అద్భుతంగా చూపించారు.

భామిని: మండలంలోని బత్తిలి, భామిని, బాలేరు, పెద్దిదిమిలి, ఆదివాసీ గిరిజన గ్రామాలైన నల్లారాయిగూడలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. తెల్లవారుజామున వీధుల్లో తిరుగుతూ పాటలను ఆలపించారు. అనంతరం భామిని, బత్తిలి చర్చిల్లో ఫాదర్ ఏసుబాబు, శాంతం, డామినిక్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ సందర్భంగా చర్చి ముందు గో శాలలు, చర్చిలను విద్యుత్ దీపాలు తో సుందరంగ తీర్చిదిద్దారు.

జియ్యమ్మవలస : క్రీస్తు జన్మించిన ఈ శుభదినం ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యాలు చేకూరాలని తెలుగుదేశం అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ అన్నారు. మండలంలోని చినకుదమలో క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కురుపాం నియోజకవర్గం టిడిపి నాయకులకు, కార్యకర్తలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి డొంకాడ మంగమ్మ, పాస్టర్ టి.రాము, సంఘం అధ్యక్షులు చెరుకుబిల్లి సుందరరావు, సర్పంచ్ చెరుకుబిల్లి గిరి పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక తెలుగు బాప్టిస్ట్ దేవాలయ సంఘ కాపరి పి.విన్సకుమార్ ఏసు పుట్టుక గురించి సందేశాన్ని వివరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎస్ సుహాస్ కుమార్, కార్యదర్శి ఎస్ ప్రకాష్, కోశాధికారి ఎన్ రమేష్, ఉపాధ్యక్షులు కే సాల్మన్ రాజ్, జాయింట్ కార్యదర్శి ఎన్ వి భాస్కరరావు, జాయింట్ కోశాధికారి ఎన్ కళ్యాణ్ ప్రసాద్ తో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.



సంఘసభలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు



భామినిలో విద్యుత్తు దీపాలతో అలంకరించిన గోశాల



కురుపాంలోని లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

సమగ్ర సస్యరక్షణతో ఆరోగ్యకరమైన పంట

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

సమగ్ర సస్యరక్షణ పద్ధతిలో సాగు చేసిన పంటలు ఎంతో ఆరోగ్యకరమైనవి, ఈ సాగు విధానం వల్ల రైతులకు పెట్టుబడులు తగ్గి, ఆదాయం ఎక్కువ వస్తుందని అభ్యుదయ రైతు కండపు ప్రసాదరావు తెలిపారు. అలాగే ప్రాథమిక విద్య నుంచే విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో వారు వ్యవసాయంలో ఆసక్తి చూపుతారని, ఇందులో భాగంగా మండలంలోని పిఆర్‌రాజు పేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తాను వేసిన కాయగూరల పొలం వద్ద అవగాహన కల్పించారు. జీవన ఎరువులైన "సూడో మోనోఫ్లోరోసిస్", "ట్రైకోడెర్మా విరిడి" ఏదో ఒక దాన్ని వంద కిలోల పశువుల ఎరువులో 1 కిలో ప్యాకెట్ కలిపి పారతో తిరగవేసి దాన్ని చెట్టు కింద నీడలో ఆరబెట్టి దానిపై గోనె కప్పి ఉదయం సాయంత్రం నీళ్లు ఐదు దినాలు చిలకరిస్తే అది బూజు రంగులో మారుతుంది. ఆ ఎరువును మొక్క మొదలు వద్ద అర కిలో వేసి కలయి పెట్టడం వల్ల మొక్కలకు నారు కుళ్ళు, ఎండాకు, అగ్గి, బూజుతెగుళ్ల ఆశించవన్నారు. వేసవిలో మొక్కలు మొదలు వద్ద తేమ ఎండిపోకుండా. "ఆచాదన"చేయాలని, అందుకు వృధాగా పారబోసిన కాగితపు భోజనం ప్లేట్లు, కొబ్బరి పీచు, ఎండు ఆకులు మొదళ్ల వద్ద వేయడం వల్ల తేమను నిల్వ చేసుకుంటుంది. నీటిపారుదలకు డ్రిప్ ఇరిగేషన్ అమర్చడం ఖర్చుతో కూడినటువంటి పనిని, అందుకు వృధాగా పారివేసినటు వంటి వాటర్ బాటిళ్లు,డ్రింక్ సీసాలకు దిగువున చిన్న రంధ్రాలు ఏర్పాటు చేసి అందులో నీరు నింపి మొదల వద్ద పడేలా అమర్చి దాన్ని ప్లాస్టిక్ తోడుతో వేలాడదీస్తే అది బొట్టు బొట్టుగా మొదల వద్ద పడి తేమ ఆరకుండా చేస్తుంది. నిరంతరం సీసామూత వాడుకోవచ్చు. ఈ విధానానికి పెట్టుబడి అవసరం లేదని, వృధాగా పారివేసి వాటిని పైవిధంగా ఉపయోగించుకోవచ్చు అన్నారు. సమగ్ర సస్యరక్షణ ద్వారా తెగుళ్ళు, కీటకాల బారి నుండి రక్షించుకోవడానికి పసుపు, నీలం రంగు అట్టలకు గ్రీజ్ గానీ, ఆముదం గాని పూసి వాటిని కొయ్యలతో మూడు నాలుగు చోట్ల పాతితే ఆ రంగులకు రసం పీల్చే పురుగులు ఆకర్షించబడి వాటిని తాకడం వల్ల పూసిన గ్రీజుకు కాళ్లు అతుక్కుపోయి చనిపోతాయని అన్నారు. దీనివల్ల రసం పీల్చే పురుగులను నియంత్రించవచ్చు అన్నారు.

అలాగే లింగాకర్ష బుట్టలను (ఫెరోమేన్ ట్రాప్స్) రెండు అమర్చడం ద్వారా అందులో ఆడవాసన కలిగి ఉండడం వల్ల మగ కీటకాలు వాసనకు ఆకర్షించబడి ఆ ఉచ్చులో పడి వాటిని నాశనం చేయడం ద్వారా సంతనోత్పత్తి తగ్గి కీటకాల శాతం తగ్గుతుందని అన్నారు. యాంత్రీకరణ ద్వారా కీటకాలను నశింప చేయవచ్చని, అందుకు ఆ ప్రాంతంలో పక్షిస్తావరాలను ఏర్పాటు చేస్తే పక్షులు వాటిపై వాలి కీటకాలను తిని వేయడం ద్వారా నశించవచ్చునని తెలిపారు. అంతేకాక రాత్రిపూట మంటలు వేయడం ద్వారా మంట వెలుగుకు ఆకర్షించబడి మంటలో పడిన నశిస్తాయనిఅన్నారు. పై విధానం ద్వారా రసాయనిక కీటక నివారణ మందు వాడకుండా సమగ్ర సస్యరక్షణ ద్వారా పెట్టుబడి తగ్గి ఆరోగ్యకరమైన పంట పండించవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని వై.నిర్మల, రైతు సీమల హరికష్ణ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పెరటిసాగుపై అవగాహన కల్పిస్తున్న అభ్యుదయ రైతు ప్రసాదరావు

125 మంది పింఛనుదారులకు నోటీసులు

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

మండలంలోని 22 సచివాలయాల పరిధిలో పెన్షన్ల పున్ణ పరిశీలనలో భాగంగా 125మంది పింఛనుదారులకు నోటీలు జారీ అయ్యాయి. ఇది కేవలం పున్ణ పరిశీలన మాత్రమేనని, పెన్షన్ తొలగింపు చర్య కాదని ఎంపిడిఒ డొంక త్రినాధులు తెలిపారు. ఈ విషయమై వెల్ఫేర్ సెక్రటరీలతో సమావేశం ఏర్పాటుచేసి, నోటీసులు వచ్చిన పెన్షనర్లు ఎవరూ ఆందోళన చెందొద్దని, ప్రస్తుతం కేవలం పరిశీలన మాత్రమే జరుగుతుందని అన్నారు. పింఛనర్లకు ఇచ్చిన నోటీసులో వివరాల ప్రాప్తికి సంబంధిత అర్హతను నిర్ధారణ చేసుకుని వివరాలను సచివాలయాలల్లో వెల్ఫేర్ సెక్రటరీలకు సమర్పించాలని తెలియజేశారు. ఏదైనా ఇబ్బంది ఉంటే నేరుగా తనను కలిసి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతినెలా 300 యూనిట్లుకు పైగా విద్యుత్ వినియోగం ఉంటే తప్ప ఒక నెల, లేదా రెండు నెలలు 300 యూనిట్లు వినియోగం చేస్తే సదరు పెన్షన్ అనర్హత పొందినట్లు కాదని పేర్కొన్నారు. అలాగే పింఛనుదారుల పిల్లలు ప్రభుత్వ ఉద్యోగులైనా, ఫోర్ వీలర్ సొంత వాహనం ఉన్నా, లేదా ఆదాయ పన్ను పరిధిలోకి వచ్చినా, మెట్టు పల్లం కలిపి పదెకరాల భూమి ఉన్న వారికి మాత్రమే నోటీసు వర్తిస్తుందని, మిగిలిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

బెనరాయిలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -సీతంపేట

మండలంలోని కొండాడ పంచాయతీ బెనరాయిలోని సమస్యలను పరిష్కరించాలని టిడిపి పాలకొండ నియోజక వర్గ నాయకులు పడాల భూదేవి డిమాండ్ చేశారు. క్రిస్మస్ సందర్భంగా ఆదివారం ఆమె గ్రామంలో పర్యటించారు. అనంతరం గ్రామస్తులకు వైసిపి ప్రభుత్వ వైఫల్యాలు, ఉద్యోగ ఉపాధి, సవర భాష వాలంటీర్ల సమస్యలు, సామాజిక పెన్షన్లు నిలిపివేత, జిపిఎస్ పాఠశాలల ఎత్తివేత, స్థానిక సమస్యలు, కొండపోడు పట్టాల గురించి, జిఒ3 పునరుద్ధరణ, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాల సమస్యలు, ట్రైకార్ రుణాలు, తదితర అంశాలపై చర్చించారు. గ్రామంలో టిడిపి బలోపేత ంపై మాజీ సర్పంచ్ సవర సుగన్న, గ్రామ పెద్దలతో చర్చించారు. కార్యక్రమంలో కూరంగి గంగన్న, అరిక సింగన్న, అరిక బంగారయ్య, కేశవ,గోపాల్ భాస్కరరావు, రమేష్ ,లిమియో, జగపతి, రవి, చిన్నారావు, పైబారి, దర్మమ్మ, చినమ్మి,సబితా, సవర మంగయ్య, ఊయక భానుచందర్, కుండంగి తేజ, తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతున్న భూదేవి

అరటి రైతు కంట కన్నీరు

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

ఉత్తరాంధ్రలో అరటి పంటకు ప్రసిద్ధి గరుగుబిల్లి మండలం ఖడ్గవలస సెంటర్ పరిధిలో గ్రామాలైన ఖడ్గవలస, సంతోషపురం, తోటపల్లి, నందివాని వలస, గిజబా. ఈ గ్రామాల్లో నిత్యం ఒడిశా, పశ్చిమబెంగాల్, జార్ఖాండ్, తమిళనాడు రాష్ట్రాలకు రోజుకు వందల లారీల్లో ఎగుమతి అయ్యే అరటి పంట నేడు రైతు కంట కన్నీరు పెట్టిస్తోంది. వేలల్లో పెట్టిబడులు పెట్టి ఏడాది పొడవునా పండించిన అరటి పంట చేతికి అందిన సమయంలో రేటు లేదని వ్యాపారులు చెప్పడంతో ఆందోళన చెందుతున్నారు. ధర లేకపోయినా నిల్వ చేసుకునే వస్తువు కాదు కనుక దళారులకు అమ్ముకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ వ్యవసాయం చేయాలన్నా రైతులు భయపడాల్సి వస్తుందని ప్రభుత్వాలు ఈ విషయంపై రైతులకు సహాయ సహకారాలు అందించాలని నంది వాని వలస గ్రామంలో రైతు కర్రి గంగు నాయుడు పంట పొలంలో పడి ఉన్న అరటి పళ్ళు గెలలు చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఏజెన్సీలో సాగైన అరటి

నేరాలు ఘోరాలు

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బొబ్బిలి

క్రిస్మస్ వేడుకలు కోసం విశాఖ నుంచి బొబ్బిలి వస్తున్న పట్టణానికి చెందిన రాజాన చంటి ఆదివారం కాలు జారీ రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. చాలా కాలంగా విశాఖలో పెయింటింగ్ పనులు చేసుకుంటూ భార్య సంధ్యారాణి, ముగ్గురు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. తన కుటుంబంతో కలిసి బొబ్బిలికి కోర్బ ట్రైన్‌లో వస్తుండగా గున్నతోటవలస సమీపంలో ప్రమాదవాస్తు ట్రైన్ నుంచి జారి కిందకు పడిపోవడంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ బి.ఈశ్వరావు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం బొబ్బిలి ఆసుపత్రికి తరలించారు.

దొంగ అరెస్ట్

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

విజయనగరం పట్టణం భగవతి హోం నీడ్ ఫర్నీచర్ షాపు గోడౌన్‌లో పరుపులు చోరికి పాల్పడిన విజయ్‌ను అరెస్టు చేసినట్లు సిఐ వెంకటరావు తెలిపారు. ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆదివారం విలేకర్ల సమావేశంలో దొంగ వివరాలను వెల్లడించారు. షాపు యజమాని బి.శ్రీను భగవత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 1వ పట్టణ పోలీసులు ఇటీవల కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో గోడౌన్ నుండి పరుపులను చోరీ చేసి, ఇతరులకు అమ్మేసినట్లుగా పోలీసులు గుర్తించారు. ఇందుకు బాధ్యులైన గాజులరేగకు చెందిన విజయ్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుండి 24 పరుపులను తిరిగి రికవరీ చేసినట్లు సిఐ బి.వెంకటరావు తెలిపారు. కేసు దర్యాప్తులో క్రియాశీలకంగా పని చేసిన ఎస్ఐ భాస్కరరావు, సిబ్బందిని సిఐ అభినందించారు.

ఘాట్ రోడ్‌లో రెండు లారీలు బోల్తా

డ్రైవర్లకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు సమీపంలో గల ఘాట్‌రోడ్‌లో రెండు లారీలు ఆదివారం ఉదయం బోల్తా పడ్డాయి. ఈ సంఘటనలో ఒక లారీ డ్రైవర్‌కు రెండు కాళ్లు విరిగిపోయాయి. మరో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఎఎస్ఐ బి.ముసలయ్య అందించిన వివరాలిలా ఉన్నాయి. ఒడిస్సా నుండి ధాన్యం లోడుతో పెద్దాపురం వస్తున్న లారీ ఆదివారం వేకువ జామున నాలుగు గంటలకు పి.కోనవలస చెక్ పోస్ట్ సమీపంలో గల ఘాట్ రోడ్లో అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. మరో లారీ ఒడిస్సా నుండి మొక్కజొన్నల లోడుతో విజయనగరం వస్తుండగా బోల్తా పడిన ధాన్యం లోడు లారీను ఢీకొని బోల్తా పడింది. ఈ సంఘటనలో మొక్కజొన్న లారీ డ్రైవర్ వినోద్‌కుమార్ సింగ్ రెండు కాళ్లు విరిగిపోయాయి. ధాన్యం లారీ డ్రైవర్ అజయ్‌సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మొక్కజొన్న లారీ ఇంజన్లో మంటలు చెలరేగడంతో సాలూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను చల్లార్చారు. గాయపడ్డ ఇద్దరు డ్రైవర్లను 108 వాహనం ద్వారా సాలూరు సిహెచ్‌సికి తరలించారు. ఎఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బోల్తాపడిన లారీలు

గుండాలపేటలో అగ్ని ప్రమాదం

డెంకాడ : మండలంలోని పెద్ద తాడివాడ పంచాయతీ పరిధిలోని గుండాలపేట గ్రామంలో శనివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు, ఒక పశువుల శాల, టేకు కర్రలు దగ్ధమయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన కార్ల సత్యం ఇంట్లో మొదట ఈ అగ్ని ప్రమాదం ప్రారంభమైంది. ఆ పక్కనే ఉన్న కాళ్ళ నారాయణ ఇంటికి, పశువుల శాలకు ఈ మంటలు వ్యాపించి కాలి బూడిదయ్యాయి. కాళ్ల నారాయణకు చెందిన టేకు కర్రలు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ. 4లక్షలు ఆస్తి నష్టం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రమాదానికి గలకారణాలు తెలియరాలేదు. విజయనగరానికి చెందిన అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఆ గ్రామ వైసిపి నాయకుడు రమణ బాధితులకు సహాయ సహకారాలు అందజేస్తున్నారు.

అగ్ని బాధితులను ఆదుకోవాలి

రేగిడి: మండలంలోని కాగితాపల్లి గ్రామంలో సుమారు 20 ఎకరాలు వరి కుప్పలు, వరిచేల నూర్పు యంత్రం, ట్రాక్టర్ అగ్ని ప్రమాదంలో ఆహుతి అయ్యాయని, సుమారు 20 లక్షల పైబడి రైతులుకు నష్టం వాటిల్లిందని రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు నారు జనార్ధనరావు, రౌతు గణపతి రావు, అప్పల నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘంతో కూడిన రైతు సంఘం ప్రతినిధి బృందం అగ్ని బాధిత కుటుంబాలను పరామర్శించి, ప్రమాద స్థలాన్ని పరిశీలించింది. అగ్ని బాధితుల్లో దూబ దాలినాయుడు 11 ఎకరాలు, దూబ సంఘం నాయుడు 2.20 ఎకరాలు, గురవాన ఫకీర్ నాయుడు 2.5 ఎకరాలు, గురవాన సంఘం నాయుడు 2.4 ఎకరాలు, గుండెల ఆనందరావు 2.6 ఎకరాలు కాలి బూడిదయ్యాయని సర్వం కోల్పోయిన పేద రైతులను ఆదుకోవాలని కలెక్టర్‌ను కలిసి నివేదికలు అందిస్తామని చెప్పారు. ప్రభుత్వం ద్వారా పరిహారం ఇచ్చే విధంగా కృషి చేస్తామని బృందం బాధితులకు హామీ ఇచ్చింది.